"వర్షం"

శ్రీ యఱ్ఱంశెట్టి శాయి

వర్షం—

వదలకుండా కురుస్తోంది ప్రొద్దుట్నుంచీ! ఎడతెరిపి లేకుండా—బురద—రొచ్చు—నీళ్ల నిండిపోయిన రోడ్లు—గుంటలు.

తగ్గటంలేదు. తగ్గేట్లుకూడాలేదు. తగ్గకపోయినా ఫర్వాలేదు. కానీ ఇంతకంటె ఎక్కువ కురవకుండాఉంటేచాలు. కాని ఎక్కువే కురిసేట్లుఉంది. మబ్బులు ఇంకా మూసుకొస్తున్నాయి. గొంగళిలా క్రమ్ముకొస్తున్నాయి. ఇదింతే! ఇవాళంతా ఇహను ఇలాగే ఉంటుంది. రేపుకూడా ఇలాగే ఉంటుంది. ఎల్లుండీ ఆ మర్నాడూకూడా ఇంతే! ఈ వూళ్లో ముసురు పడితే ఇలాగే పడుతుంది. వారం, పదిరోజులు జలగలా పట్టేస్తుంది. ఛస్తే వదలదు. మనుషులను ముంచి తేలుస్తుంది. మొలకలెత్తించేస్తుంది. మట్టిగోడలను పెకలించేస్తుంది. పాతఇళ్లను కూల్చేస్తుంది. క్రొత్త ఇళ్లకు చిల్లులు పెట్టేస్తుంది. అరుణాచలానికంతా తెలుసు. ఇప్పుడు కాదు. డెభ్భైఏళ్లనుంచీ చూస్తున్నాడు ఈ వర్షాన్ని. ఒక్కసారికూడా ఈ ఊరు వదిలి బయటకుపోలేదు.

వర్షం తగ్గింది. తగ్గిందా? లేదు. తగ్గలేదు. ఆలానే ఉంది. కాని తగ్గినట్లు నటిస్తోంది. తన నిలా అనేకసార్లు మోసంచేసింది. అరుణాచలానికి తెలుసు. కాని ఇలా ఎంతసేపని? ఇంటికి వెళ్లాలి. నడిచి, తడిసి ఎలాగోలా ఇల్లు చేరుకోవాలి. లేకపోతే — తనిలాగే నుంచుండిపోతే చీకటిపడిపోతుంది. చీకట్లో వర్షానికి మరీ అలుసు. హద్దూ అదుపూ లేనట్లు, ఇష్టంవచ్చినట్లు కురిసేస్తుంది.

నడువసాగాడు అరుణాచలం. తడుస్తూ — వర్షంలో.

ఈ ఒఖ్ఖ క్షణమేకాదు. ఒక్క రోజేకాదు. డెభ్భయ్ ఏళ్లనుంచీ—ఊహవచ్చిం దగ్గర్నుంచీ ఇంతే—ఎప్పుడూ ఇంతే!

అప్పుడు, చిన్నప్పుడు బడి వదలగానే వర్షంలో తడుస్తూ ఇంటికి వచ్చేవాడు. అది ఆనందం. తడుస్తూంటే—తడవాలంటే ఇష్టం! అందుక్కారణం లేదు. బహుశా తల్లీ తండ్రీ తడవకూడదని చెప్పబట్టి అయుంటుంది. ఆ రోజుల్లో — వద్దన్న పని చెయ్యటంలో గల ఆనందం, మరెందులోనూ లేదు. సీత కూడా తనతోపాటే వర్షంలో తడిసేది. సీతక్కూడా వర్షంలో తడవడమంటే ఇష్టం! కాని వాళ్లమ్మ సీతని చావగొట్టేది తడిసినందుకు. అరుణాచలంతల్లి ఏమనేదికాదు. తుండు తీసుకొచ్చి తలతుడిచి, పొడి బట్టలు తొడిగి పొయ్యిదగ్గర వేడిగా కూర్చోబెట్టేది. సీతఏడుపు అక్కడకూర్చుని చాలాసేపు వినేవాడు తను.

వర్షం ఎక్కువయింది. తగ్గినట్లుతగ్గి ఎక్కువయింది. పూర్తిగా తడిసిపోయాడు అరుణాచలం. కాని ఇదేమీ క్రొత్తకాదు. ఫరవాలేదు. తనకూ వర్షానికీ చాలా అనుబంధంఉంది. తను లేకపోతే వర్షంలేదు వర్షంలేకపోతే తనులేదు.

హైస్కూల్‌లో చేరినప్పుడు—అప్పుడూ ఇంతే.

తండ్రి గొడుగు కొనలేదు కనుక కొనలేదు. రెండుమైళ్లు కాలువగట్టు వెంబడేనడిచి హైస్కూలుకి వెళ్తూండేవాడు అరుణాచలం. పుస్తకాలు ప్లాస్టిక్ సంచిలో—నెత్తిమీద ప్లాస్టిక్‌గుడ్డ – వళ్లంతా వర్షంనీళ్లు – సీత హైస్కూల్లో చేరలేదు. ఆపిల్ల ఎక్కువ చదవటం వాళ్లనాన్నకిష్టంలేదు. చదివిందే ఎక్కువని మానిపించేశాడు. మానిపించిందే, మంచిదయిందని ఆ పిల్ల కేరింతాలు కొడుతూ గంతులేసింది.

కిటికీదగ్గర కూర్చొని తను స్కూలుకి పోయేప్పుడూ, వచ్చేప్పుడూ వెక్కిరిస్తూండేది. వెక్కిరిస్తూనే ఎదిగి పోయింది. ఎదిగి, పెళ్లీడుకొచ్చింతరువాత ఎదగటం మానేసింది. ఎదగటం మానేసి తనను వెక్కిరించ డవూ మానేసింది. ఆ పిల్ల ఎదిగినంతగా అరుణాచలం ఎదగలేకపోయాడు. అంచేత సీత ఓ ఉత్తరం వ్రాసి కిటికీలోనుంచి అందించి చదువుకొమ్మని చెప్పినప్పుడు భయంతో వణికిపోయాడు. గుప్పిట్లో ఇరికించుకొని మామిడితోటలమధ్యకు పరిగెత్తి అక్కడ విప్పిచదివాడు.

'రాత్రి పదిగంటలకు మా పెరట్లోని బాదం చెట్టు క్రిందకురా! నీకోసం ఎదురుచూస్తుంటాను. నీతో మాట్లాడాలి—సీత.'

చమటలు పట్టినయి అరుణాచలానికి. ఆ రాత్రంతా తన ప్రక్కమీద నిద్రలేవకుండానే అటూ ఇటూ పొర్లుతూ గడిపాడు. బయట భోరున వర్షం— ఉరుములతో—మెరపులతో—అప్పుడే పదికొట్టింది గడి యారం. సీత! పాపం—తనకోసం ఎదుర్చూసి— వర్షంలో తడిసింది. మర్నాడు లేవలేదు. జ్వరం! ఆ మర్నాడూ జ్వరమే!—ఆ తరువాత చాలా రోజులు జ్వరం.

కాలేజిలో చేరాక ఎదిగాడు అరుణాచలం. ఎది గిన రోజున సీత గుర్తుకొచ్చింది. కిటికీలోనుంచి అందించిన ఉత్తరం — మామిడితోటా—ఆ రాత్రి వర్షం—అన్నీ గుర్తుకొచ్చినయి. ఇవన్నీ గుర్తు కొచ్చి నప్పుడు సీతకి ఉత్తరం వ్రాశేడు. అందించడానికి కిటికీ దగ్గరకు వెళ్ళాడు.

'నా పెళ్ళి!' అంది సీత.

'ఎప్పుడూ?'

'లగ్నానికింకా పదిహేన్రోజు లుంది!'

అరుణాచలం ఉత్తరం ఇవ్వలేదు. ఇవ్వాలని పించలేదు. ఏదో దిగులు అలుముకొంది. సీతకు పెళ్లవు తోంటే దిగులెందుకు? విచారమెందుకు?

అర్థంకాలేదు. తిరిగి వచ్చేశాడు.

సీతపెళ్లి అయిపోయింది. పెళ్లికి అరుణాచలం హాజరయ్యేడు. పెళ్లయిం తర్వాత అత్తారింటికి వెళ్లి పోయింది సీత. అరుణాచలం మిగిలిపోయాడు. సీతను మర్చిపోడానికి స్నేహాలకోసం వెతికాడు. రాఘవరావూ, రమణా వండగలాంటి జీవితం చూబించేరు. సిని మాలు—సిగిరెట్లు – పేకాటలూ — కాఫీహోటళ్లు — డబ్బు వృథా చెయ్యొద్దంటూ తండ్రినుంచి ఉత్త రాలూ—డబ్బుకోసం తనిచ్చే పెల్లిగ్రాం రసీదులూ— అందుకొనే టి. యం. వో.లూ—వెనుకబెంచీల్లో గొడ వలూ — ఫిజిక్స్ లెక్చరర్‌తో గొడవ — స్ట్రైకు— ఆయనమీద రాళ్ళురువ్వటం — పోలీస్ కేస్ — కాలేజ్ నుంచి డిబార్ అవటం —

వర్షం కొంచెం తగ్గింది.

అరుణాచలం జోరుకూడా తగ్గింది. అప్పుడే తండ్రికి పక్షవాతం—హాస్పిటలూ—ఇల్లూ—చెల్లాయ్ పెళ్లి—అప్పు—నిరుద్యోగం—రెండేళ్లు చెప్పల్లేకుండా ఉద్యోగంకోసం వెదికాడు. ఫ్రెండ్సందరూ పై చదు వులకు వెళ్లారు—అరుణాచలం ఒఖ్ఖడే మిగిలిపోయేడు.

రికమండేషన్‌కోసం వెతికాడు అరుణాచలం. పువ్వులమ్మేచోట కల్పెలు—రిక్షాలమీద సినిమాలకీ— సినిమాల్లో మొదటిరోజున — బాల్కనీలో మొదట కూర్చోటానికీ, హోటల్స్‌లో క్లాస్‌మిల్సు తినడానికీ – డ్రింకులు త్రాగడానికీ—రాత్రుళ్లు పెందలాడే నిద్ర పోయి — ఆలస్యంగా నిద్రలేవడానికీ — అలవాటు పడిన ఆ ఊళ్లో — కాళ్లకు చెప్పల్లేకుండా నడుస్తూ—అతుకుల బట్టలు తొడుగుతూ—సినిమా బొమ్మలుకూడా చూసే తాహతులేక—పంపు నీళ్లతో దాహం తీర్చుకుంటూ—ప్లేట్ భోజనంతో కడుపు నింపుకొని — దిగుళ్లతో ఆలోచనలతో నిద్రలేని రాత్రుళ్ళు గడిపి—భగవాన్—అప్పుడు, ఆ రోజు ల్లోనూ, ఇదే వర్షం—

వర్షం బాగా తగ్గిపోయింది. సన్నగా తుంపర పడుతోంది. మబ్బులు విచ్చుకోడానికి ప్రయత్నిస్తు న్నాయి. వెలుతురు అలుముకోడానికి పోరాడుతోంది. అవును.

అప్పుడే నులకమంచంమీద పడుకొని ఆరు బయట చంద్రుడ్ని చూస్తోంటే కిటికీలోంచి సీత గొంతు వినిపించింది. ఆశ్చర్యపోయేడు.

'బాగున్నావా?' అడిగింది సీత.

'ఓ! నువ్వెప్పుకొచ్చావ్?' ఆనందంగా అడిగాడు అరుణాచలం.

'సాయంత్రం!'

'మీ ఆయన?'

'వాడి పేరు మృగం అనిపెట్టాను! 'ఆయన' అనకు!'

'అదేమిటి?'

'అదో పెద్దకథ. చిన్నప్పుడు నువ్వు నాకు చెప్పేవాడివి చూడు అంతపెద్ద కథ." కిలకిల నవ్వుతూ అందామె.

ఆమె అందంచూసి ఉక్కిరి బిక్కిరయ్యాడు అరుణాచలం.

ఆ రాత్రి పది గంటలకు బాదంచెట్టుక్రింద ఆమెను కలుసుకొన్నాడు. అక్కడే కొన్ని రోజుల ఆనందం. జీవితంమీద క్రొత్త ఆశలు—అప్పుడే ఉద్యోగం దొరికింది. ఆ ఊళ్లోనే ఓ ఆఫీసులో గుమాస్తా—జాయినవ్వమంటూ ఇంటికి నవ్వు కొంటూవచ్చి అడిగిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ —దాన్తోపాటు వర్షం—ముసురు–తడుస్తూనే, తడిసిన కోడిలా ఆఫీసుకు వెళ్లాడు అరుణాచలం.

'పాపం! తడిసిపోయేరే!'

జాలిపడ్డాడు హెడ్‌క్లర్కు మొదటిరోజున.

రెండోరోజూ వర్షం — మూడూ, నాలుగూ—పదిరోజులు ముసురయింది. అలవాటయిపోయింది. నెల రోజుల తర్వాత జీతం చేతికందినరోజున మామూలు మనిషిలా నవ్వాడు అరుణాచలం. సీతకి పూలుకొన్నాడు. సరిగ్గా ఉద్యోగంలో చేరిన సంవత్సరానికే—

చినుకు ఉన్నట్లుండి పెద్దదయింది.

అరుణాచలం తడుస్తోనే నడుస్తున్నాడు. ఇల్లు ఇంకో రెండుఫర్లాంగు లుంటుంది. పదినిమషాల్లో చేరుకోవచ్చు. ఎలాగూ తడిసిపోయాడు. వెధవ్వర్షం—తనకి పెళ్లయినరోజూ ఇంతే.

సీతకీ — తనకూ ఏర్పడిన చనువు మెల్లగా ఊరంతా వ్యాపించి అందరి నోళ్లల్లోనూ నానింది. వెంటనే తండ్రి తనకు తగిన శాస్తి చేశాడు.

'చిరంజీవి అరుణాచలానికి, వెంకటనర్సయ్య బావగారి ద్వితీయపుత్రిక చిరంజీవి సౌభాగ్యవతియగు సరస్వతినిచ్చి...' వివాహం జరిగిపోయింది. పెద్దల సమక్షంలో సరస్వతిమెడలో మంగళసూత్ర ధారణ —కాళ్లకు మ్రొక్కటం — ఆశీర్వాదాలూ— నెత్తిమీద అక్షింతలూ—చిరంజీవ—చిరంజీవ సుఖీభవ — సుఖీభవ — సరస్వతి బదులుగా సీతేకనిపించింది అరుణాచలానికి.

వర్షం—ఉక్కిరి బిక్కిరిచేస్తూ అప్పుడూ ఇదే వర్షం—అరుణాచలం, సరస్వతులమీద పందిట్లోంచి నీటిచుక్కలు పడుతున్నాయి. ఆ రాత్రి—చీకటి రాత్రి వర్షం ఎడతెరిపి లేకుండా కురిసిన రాత్రి—కుమారి సరస్వతి—శ్రీమతి సరస్వతి అయింది. వెచ్చగా—అరుణాచలం గుండెల్లో సరస్వతి నిద్రకు, నోచుకోని ఆ రాత్రి—జీవితాన్ని తుదికంటా అనుభవించటానికి నిర్ణయించుకొన్న అరుణాచలానికి నిద్రగురించి గుర్తుకి రాలేదు. గుర్తుకొచ్చేసరికి తెల్లారిపోయింది. తెల్లారిం తర్వాత నిద్రపట్టలేదు. భూమీ—ఆకాశం సరస్వతీ అరుణాచలం, చుక్కలూ చెంద్రుడూ, సరస్వతీ అరుణాచలం—అరుణాచలం, సరస్వతీ రెండు నెలలు గడిచిందాకా గడిచినట్లు తెలీలేదు అరుణాచలానికి. తెలిసిం తర్వాత నమ్మలేక పోయాడు. రెండు నెలల జీతం ఒక్కసారే తీసుకొన్న తర్వాతగానీ నమ్మకం కలుగలేదు. సినిమాకు వెళ్ళడానికి అరుణాచలం పెళ్లి సూటు తొడిగేడు. సరస్వతి అందంగా తయారయింది. బయల్దేరుబోతూండగా భోరున వర్షం ప్రక్కింట్లోంచి బిగ్గరగా ఏడుపులు. సీత కిరసనాయిలు వంటిమీద పోసుకొని నిప్పంటించుకొంది. వళ్లు సగం కాలిపోయింది. అరుణాచలం టాక్సీలో తనూ హాస్పిటల్‌కు వెళ్లేడు.

'చాలా కష్టం ఈ పిల్ల బ్రతకటం!' అన్నారు డాక్టర్లు. అరుణాచలానికి ఏడుపు రాలేదు. ఏదో దిగులనిపించింది. సీత పెళ్ళయి వెళ్ళిపోతున్నప్పుడు అనిపించిన దిగులే! ఆ రాత్రంతా సీత దగ్గరే కూర్చున్నాడు జాగారంచేస్తూ. తెల్లవారుజామున స్పృహలోకొచ్చింది సీత.

'నీకు నేనేమీకానుకదూ?' అంది నీరసంగా, అస్పష్టంగా. అరుణాచలాని కేమీ అర్థంకాలేదు. అర్థం చేసుకొనేటప్పటికి తెల్లారిపోయింది. ఆలస్యమయిపోయింది.

ఆఖరుసారిగా సీతమొఖంలోకిచూసి ఏదో గొణిగి ఇంటికి వచ్చేశాడు. ఆ రోజునుంచీ అరుణాచలం మారిపోయేడు. అయినా వర్షం అతన్ని వదలలేదు. అతన్ని ఆసరాగా చేసుకొన్న సరస్వతినికూడా వర్షం వదల్లేదు. బయటా—ఇంట్లో—జీవితమంతా — వర్షంలో తడి సింది. మొదట్లో ఇల్లు మారదామంది. తర్వాత తనే మారిపోయి మళ్లీ అలా అనడం మానేసింది.

తరువాత — మరుసటి సంవత్సరం మళ్లీ వర్షాలు—అప్పుడే సరస్వతి నొప్పులు-వర్షంలో రిక్షాలో మిషనాసుపత్రికి—ఓ రోజంతా శెలవుపెట్టి తడుస్తూ తిరిగాడు—సాయంత్రానికి ఆడపిల్ల—అరుణాచలానికి సంతోషం కలిగింది. తనిప్పుడు ఓ బిడ్డతండ్రి. ఆ సంతోషంలో వర్షాన్ని మర్చిపోయేడు — సరస్వతి ఓ రోజు పాపను ఇంటికి తీసుకువచ్చింది. పెంకుటిల్లు ఇష్టంవచ్చినట్లు కారుతోంది. కారని ఓమూల సర స్వతి పాపాయితో వెచ్చగా పడుకొంది — మరోచోట పాములా మెలితిరిగి పడుకొన్నా డరుణాచలం.

ఎక్కడో పిడుగుపడింది.

అరుణాచలం నడుస్తూనే ఉన్నాడు. ఇంకొక్క ఫర్లాంగు దూరముంటుంది ఇల్లు—చలిగాలి విదిలించి కొడుతోంది. వణుకుతున్న డరుణాచలం చలిగాలిలో—తడిసిన బట్టల్తో—మరుసటి సంవత్సరం సరస్వతికి మరో ఆడపిల్ల. సంవత్సరాలు రోజుల్లా గడిచినయి. ఒక్కొక్కరోజూ వందేళ్లల్లా గడిపాడు అరుణాచలం. బరువు — సంసారం బరువు — ఆఫీసుబరువు— తన బరువు—ఇంటిబరువు — వర్షంబరువు— ఎవరయినా నవ్వుతోంటే రెప్పవాల్చకుండా చూడ బుద్ధయేది.

'పెద్దదానికి ఏదో సంబంధంచూడండి! ముడి పెట్టేద్దాం!' అంది సరస్వతి. ఓ కుర్రాడు వచ్చాడు చాముండిని చూడ్డానికి. చాముండిని సరిగ్గా తనూ అప్పుడే చూశేడు అరుణాచలం—చీరకట్టుకొని, సర స్వతంత ఎత్తున సరస్వతిలానే ఉంది. లోపలకువెళ్లి మిగతాపిల్లల్ని ఆతృతగా చూశాడు. రెండోది ఓణీ లేస్తోంది. మూడోది లంగాజాకెట్టూ — నాలుగోవాడు నిక్కరూ చొక్కా.

'కుర్రాడికి పిల్ల నచ్చిందట. రెండువేలయినా ఇస్తేగాని కుదర్దట'. లోన్ తీసుకొన్నాడు అరుణా చలం- మిగిలిన సరస్వతి నగలుకూడా కేరింతాలు కొట్టు కొంటూ ఎగిరిపోయినయి.

చాముండి పెళ్లయింది. కాళ్లు కడిగి కన్యాదానం చేశాడు అరుణాచలం.

ఆరోజుకూడా వర్షం కురిసింది.

'మనపెళ్లికీ వర్షంకురిసింది మీకుగుర్తుందా?' పెళ్లయింతర్వాత పందిట్లో పందిరిగుంజ నానుకొని నుంచుని అడిగింది సరస్వతి.

చాముండి భర్తతో వెళ్లిపోయింది.

మరికొన్ని సంవత్సరాలు వర్షంలో తడిసినయి.

రిటయిరయ్యాడు అరుణాచలం. ఆఖరిరోజు ఆఫీసులో పనిచేసి బయటికొస్తూంటే — బ్రిటిష్ వాళ్లు కట్టించిన ఆ భవనం ఎలావచ్చాడో అలా వెళ్తున్న అరుణాచలాన్నిచూసి నవ్వింది. అతను దాన్ని చూసి ఏడ్చేడు. ఇంటికొచ్చి అద్దంలో చూసుకొన్నాడు. జుట్టంతా నెరసిపోయింది. మొఖమంతా గీతలు — ముడతలు—పరుగుతో వంటింట్లోకెళ్లి సరస్వతిని నుంచోబెట్టి పరీక్షగా చూశేడు.

కళ్లల్లోని అదివరకటి కాంతీ, చెక్కిళ్ల నునుపూ-మొఖంలోని సన్ననిగీతలూ—అప్పటి సరస్వతి కాదు. ఇది మాంసంతో అసహ్యంగా తయారుచేయబడిన మనిషిబొమ్మ.

మార్కెట్‌వేపు వెళ్లేడు అరుణాచలం ఆ సాయంత్రం. కొలిమిదగ్గర వెంకటేశ్వర్లు బండి చక్రాన్ని త్రిప్పుతున్నాడు. గిఱ్ఱున తిరుగుతోం దది.

ఎఱ్ఱగా కాలిన ఇనుపపట్టీ ఆతుకుపడుతోంది.

తిరిగి ఇంటికొచ్చేసరికి సరస్వతి చనిపోయింది.

'అదృష్టవంతురాలు!' అన్నారెవరో.

బయట వర్షం.

పెంకుల్లోంచి నీటిచుక్కలు అరుణాచలం మీదా—సరస్వతి శవంమీదా పడుతున్నయి.

ఉప్పెనలా వస్తోన్న దుఃఖాన్ని అణుచుకోటం సాధ్యంకాలేదు.

'నన్నుచేసుకొని నువ్వు సుఖపడలేదు సరస్వతీ-నిన్నూ, సీతనీ– ఇద్దరినీ దూరంచేసుకొన్నాను. ఎవ్వరికీ దగ్గరకాలేకపోయాను. నన్ను క్షమించు...'

శ్మశానానికి వర్షంలో నడిచాడు అరుణాచలం.

మంటలు—పొగ...

పెళ్లిచూపుల్లో ఓరగా చూసినచూపూ—తలంబ్రాలు పోసేప్పుడు చిలిపిదనం—కౌగిట్లో కోరికనిండిన కళ్ళూ—చాముండిని కన్నరోజు గర్వం నింపుకొన్న చూపూ—

ఇంటికి తిరిగివచ్చాడు అరుణాచలం.

ఇల్లు శ్మశానంలాఉంది. కష్టాల్ని మాత్రమే సగానికి పంచేసుకొనీ ఏమీతెలీనట్లే—ఏమీతెలీనీకుండా-కలిసిపోయి—మెసిలిన సరస్వతి—వర్షం వదలలేదు—

ఇల్లు చేరుకొన్నా డరుణాచలం.

ఇంట్లో లైట్లు వెలుగుతున్నయి. కోడలు బయట కూర్చుని పిల్లాడికి పాలిస్తోంది. కొడుకు మనవడితో ఎక్కాలు చదివిస్తున్నాడు. అరుణాచలం మెట్లు ఎక్కేడు. మనవడిలో పూర్తిగా అరుణాచలం పోలికలే కనిపిస్తున్నయి. చిన్నప్పుడు తనూ అలానే ఎక్కాలు చదివేడు. చివరిమెట్టు ఎక్కుతోంటే కాలు జారిపోయింది. దబ్బునపడిపోయే డరుణాచలం—గుండెలిమీద గునపం దిగినట్టు నొప్పి—నవ్వు వచ్చిం దరుణాచలానికి, పాతనవ్వుని గుర్తుతెచ్చుకొని నవ్వేడు.

'వద్దంటే వినకుండా బయటకివెళ్తారు...... చూడండి ఎలా పడిపోయారో?' లేవనెత్తుతూ అంటున్నాడు కొడుకు.

లోపల మంచంమీద పడుకోబెట్టేరు అరుణాచలాన్ని. కళ్లు చీకట్లు క్రమ్మినట్లనిపించింది. ఇక్కడే! ఇదే మంచంమీద సరస్వతి—వెళ్లిపోయింది—తనూ—ఇక్కడే -

అందరూ అరుణాచలంమీదపడి ఘొల్లున ఏడిచేరు.

వర్షం ఆగిపోయింది. ఆకాశంఅంతా నిర్మలంగా అయిపోయింది.

———